క్లుప్తంగా

జీవనోపాధి కల్పించాలి

అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రం వట్‌పల్లిలో నాలుగు వరుసల రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోతున్న వారికి ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం బాధితులను పరామర్శించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా దుకాణాలు పెట్టుకొని బతుకున్నారు. రోడ్డు విస్తరణ పనులతో జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ వినోద్‌గౌడ్, మాజీ డైరెక్టర్ బుద్ధిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శివాజీరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధు, పుల్‌కల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, బస్వరాజ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలి

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

పటాన్‌చెరు టౌన్: ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి రేపటి భావిభారత పౌరులుగా ఎదగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఎక్స్ ఫ్లోరా అవార్డుల కార్యక్రమంలో మండలంలోని ముత్తంగి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి 11 అవార్డులు సాధించారు. అవార్డులను జేడీ లక్ష్మీనారాయణ అందజేశారు. కృష్ణవేణి విద్యాసంస్థలు, మాస్టర్‌మైండ్స్, నారాయణ పాఠశాల చైర్మన్‌లు రాజు సంగాని, కల్యాన్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వంట గదులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అర్చకులు తదితరులు

నారాయణఖేడ్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయానికి వంటగది, డైనింగ్ హాల్ కోసం అవసరమైన స్థలాన్ని దరుగొండ మనోహర్ కుటుంబ సభ్యులు భక్తిభావంతో తక్కువ ధరకు విక్రయించారు. అలాగే, నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు మలమంచి మోహన్ జ్యోషి, అర్చకులు రమేష్ పంతులచే భూమి పూజ చేయించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు వీరయ్య, ఏసురెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న బైక్ ర్యాలీ



గోడపత్రికను విడుదల చేసిన వరదాచార్యులు

సంగారెడ్డి టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైకుంఠపురం ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం భవాని మందిర్ నుంచి ప్రారంభమై పుర వీధుల గుండా సంగారెడ్డి పట్టణం నుంచి వైకుంఠపురం వరకు ఉంటుందన్నారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మ ప్రసార తెలంగాణ ప్రాంత సహ ప్రముఖ చందర్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుద్దుస్(40) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుద్దుస్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మహేందర్‌రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

అంతా రామనామం

శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాలో సీతారాముల కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కనుల పండువగా సాగింది. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. రామనామంతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



జహీరాబాద్: కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం



నారాయణఖేడ్: రాములోరికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ సురేష్ దంపతులు



జహీరాబాద్ టౌన్: రాములోరికి హారతి ఇస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్




జహీరాబాద్: శ్రీరాముడు, ఆంజనేయస్వామి విగ్రహాలతో శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు



శోభాయాత్రలో మాట్లాడుతున్న మనోజ్



కల్యాణం నిర్వహిస్తున్న అంజిరెడ్డి దంపతులు



జిన్నారం: సీతారామ విగ్రహమూర్తులు



హత్నూర: నస్తీపూర్ రామాలయంలో..



రామచంద్రారెడ్డినగర్ కాలనీలో..



నారాయణఖేడ్‌లో..



కంది(సంగారెడ్డి): మామిడిపల్లిలో..



పటాన్‌చెరు : నిర్వాహకులతో కాటా సుధా



సంగారెడ్డి రూరల్: కల్యాణం జరిపిస్తున్న పూజారి

మనోహర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలి

ఎంపీ సురేశ్ షెట్కార్



మనోహర్‌రావుకు మిఠాయి తినిపిస్తున్న ఎంపీ

నారాయణఖేడ్: గ్రూప్– 2లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించిన సిర్గాపూర్ మండలం ఉజలం పాడ్ గ్రామానికి చెందిన మనోహర్‌రావును యువత ఆదర్శంగా తీసుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు. ఖేడ్‌లోని తన నివాసగృహంలో ఆదివారం మనోహర్‌రావును ఎంపీ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖేడ్ ప్రాంత యువకులు చదువులో ముందుండి విజయాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒక అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆస్పత్రి సిబ్బంది గమనించి అత్యవసర వార్డుకు తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో పలు దుకాణాల్లో భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి జాన్.డి.శాన్‌టిస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 8712656718కు ఫోన్ చేయాలని కోరారు.

యువతి అదృశ్యం



పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ గ్రామానికి చెందిన ప్రవళిక (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో తండ్రి ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఊరూరా పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జగన్నాథ్ మాట్లాడుతూ.. జనసంఘ్ నుంచి గొప్ప నాయకుల ఆధ్వర్యంలో బీజేపీగా అవతరించిందన్నారు. బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు.



జహీరాబాద్ టౌన్: ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

హత్నూర మండలంలో..

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి.. పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఒకేరోజు రావడంతో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామశాఖ అధ్యక్షుడు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఆత్మకూరులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.



హత్నూర: నవాబుపేట గ్రామంలో..



ఝరాసంగం: కక్కర్‌వాడలో..

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారుతిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ముఖ్యనాయకులు సాయిరాం, పత్తిరి రామకృష్ణ, అరుణ్ శేరికార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ మండలం రుద్రార్‌లో మండల పార్టీ అధ్యక్షుడు దశరథ్‌కురుమ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

జిన్నారం మండల కేంద్రంలో..

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీని అంచలంచెలుగా ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

బీటీ రణదివె గొప్ప విప్లవకారుడు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీటీ రణదివె గొప్ప విప్లవకారుడు, మేధావి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అన్నారు. ఆయనన 35వ వర్ధంతి సందర్భంగా మండలంలోని నందికంది శివారులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాటి బీటీ రణదివె విషయాలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయని గుర్తు చేసుకున్నారు. కుల నిర్మూలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని అప్పడే పిలుపునిచ్చారని తెలిపారు. ఆయన చెప్పినట్లుగా నేటికీ కుల వివక్షత, కార్మిక దోపిడీ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



రణదివె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లేశం

బీటీ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్ కుమార్, పరిశ్రమ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రాజు, వీరేశం, జనార్దన్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేట్‌కు చెందిన నవీన అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆస్పత్రి ఖర్చులకోసం సీఎం సహాయనిధి నుంచి రూ.10 వేలు మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వరాచారి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, పండరి, పోచయ్య, ఇస్మాయిల్, దస్తగిరి, లక్ష్మణ్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న భూపాల్ రెడ్డి

చెత్త 'బస్టాండ్'

జహీరాబాద్ టౌన్: జిల్లాలోనే అతి పెద్దదైన జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మూడు రాష్ట్రాల బస్సులు.. వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉంటున్నా ఆర్టీసీ యాజమాన్యం పారిశుద్ధ్య నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సెలవు వచ్చిందంటే చాలా బస్టాండ్‌లో చెత్త పేరుకుపోతుంది. చెత్త బుట్ట ఉన్నా రోడ్డు పైనే పారబోసి వెళ్తుంటారు. దీంతో ప్రయాణికులు దుర్గంధం భరించలేక పోతున్నామని వాపోతున్నారు. చెత్త పారబోస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బస్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్త

ధనసిరిలో యువకుడి హత్య

పాతకక్షలే కారణమని అనుమానం

జహీరాబాద్: మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన అబ్బాస్(25) అనే యువకుడిని అదే గ్రామానికి చెందిన యువకులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గత మూడు నెలలుగా అబ్బాస్ సంగారెడ్డిలో ఉండి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద విందు చేసుకునేందుకు అబ్బాస్ తన స్నేహితులు, దాయాదులతో కలిసి వెళ్లాడు. విందులో పథకం ప్రకారం మారణాయుధాలతో దాడిచేయడంతో అబ్బాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, హత్యకు పాల్పడిన నిందితులు సంగారెడ్డి వైపు పారిపోతూ కంకోల్ టోల్‌గేటువద్ద పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు చిరాగ్‌పల్లి పోలీసులు విచారిస్తున్నారు.



హత్యకు గురైన అబ్బాస్

విద్యుదాఘాతంతో రైతు మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పొలం పనులకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన వెల్టూర్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు సార మల్లేశం (58), ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. పొలంలో మృతి చెంది పడి ఉన్నాడు. పొలం చుట్టూ వేసిన విద్యుత్ తీగలు తగిలి మల్లేశం మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. సదాశివపేట పోలీసులకు సమా చారం అందించడంతో వారు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి గ్రామంలో మృతి చెందిన మాడబోయిన నర్సింహులు అంత్యక్రియల కోసం మాజీ సర్పంచ్ భర్త మిట్టపల్లి రుషి రూ. 8వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన నర్సింహులు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని తెలిపారు. యజమాని చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, ఉపేందర్‌గౌడ్, నరేశ్, వేణు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త.. కాల్చిస్తే ఎట్లా!



రోడ్డు పక్కన తగలబడుతున్న చెత్త

పటాన్‌చెరు టౌన్: ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, సేకరించిన చెత్తతో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంగా సెగ్రిగేషన్ షెడ్లను గత ప్రభుత్వం నిర్మించింది. అయితే, ఇటీవలే మండలంలోని ముత్తంగి గ్రామాన్ని తెల్లాపూర్ మున్సిపాలిటీలోకి విలీనం చేశారు. గతంలో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించేవారు.. ప్రస్తుతం వివిధ ప్రాంతాలను నుంచి సేకరించిన చెత్తను తీసుకొచ్చి ముత్తంగి గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే వేసి తగలబెడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీరు మారడం లేదు. చెత్తను తగలబెడుతుండటంతో దుర్వాసన రావడంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.